ప్రజల భాగస్వామ్యంతోనే మాదక ద్రవ్యాల నిర్మూలన : కలెక్టర్ 8
పాఠశాలల బంద్ విజయవంతం 8

హస్తినకు పిలుపు

- హైకమాండ్ నుంచి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి కబురు
- జిల్లా నాయకులతో కలిసి హుటాహుటిన ఢిల్లీకి పయనం


ఎయిర్‌పోర్టులో ప్రభుత్వ విప్ అడ్లూరితో ముచ్చటిస్తున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

జగిత్యాల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ కాంగ్రెస్‌లో చేరికపై అసంతృప్తితో ఉన్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని బుజ్జగించేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం చర్యలు చేపట్టింది. తనకు ఎలాంటి సమాచారం లేకుండా ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను కాంగ్రెస్‌లోకి చేర్చుకోవడాన్ని నిరసిస్తూ ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడానికి సీనియర్ కాంగ్రెస్ నేత జీవన్‌రెడ్డి సిద్ధమయ్యారు. రెండు, మూడు రోజులుగా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు పలు విధాలుగా నచ్చచెపుతున్నా ఆయన వెనక్కి తగ్గలేదు. శాసన మండలి చైర్మన్‌ను కలిసి తన పదవికి రాజీనామా చేయనున్నట్లు జీవన్‌రెడ్డి ప్రకటించారు. ఈ నేపథ్యంలో జీవన్‌రెడ్డి వ్యవహారంపై ఏఐసీసీ నేతలు దృష్టి సారించారు. ఢిల్లీకి రావాల్సిందిగా పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ నుంచి పిలుపు వచ్చింది. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని ఢిల్లీకి తీసుకవచ్చే బాధ్యతను ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు అప్పగించారు. దీంతో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి, జీవన్‌రెడ్డి తనయుడు బాల చంద్రారెడ్డిలు హైద్రాబాద్ లోని ఎయిర్ పోర్టు నుంచి ఢిల్లీకి బయలు దేరి వెళ్లారు.

ఢిల్లీలో తెలంగాణ కీలక నేతలు

ఢిల్లీలో ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి టూర్ నిర్వహిస్తున్నారు. దీనికి తోడు రెండు రోజులుగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని బుజ్జగించడానికి ప్రయత్నించి పలు వివరాలు సేకరించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఢిల్లీలో మకాం వేశారు. వీరితో పాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్, సీతక్క, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, జూపల్లి తదితరులు సైతం ఢిల్లీలోనే ఉన్నారు. ఢిల్లీలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీతో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కలిపించే అవకాశాలున్నట్లు కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లి ఖార్జున ఖర్గే, నాయకులు కేసీ వేణుగోపాల్ తదితరులతో సైతం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి భేటీ అయ్యే అవకాశాలున్నాయి.

హైకమాండ్ ముందు తాడో పేడో..!

జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను కాంగ్రెస్‌లోకి చేర్చుకున్న వ్యవహారంపై ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కాంగ్రెస్ అధిష్ఠానం ముందే తాడో పేడో తేల్చు కోడానికి సిద్ధమైనట్లు కాంగ్రెస్ కార్యకర్తలు అంటున్నారు. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి రాజీనామా లేఖను సమర్పిస్తానని ప్రకటించిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని బుజ్జగించడానికి ఏఐసీసీ రంగంలోకి దిగింది. నాలుగు దశాబ్దాలుగా జగిత్యాలలో కాంగ్రెస్ బాధ్యతలు నిర్వహించిన తనకు తెలియకుండా పార్టీలోకి ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను ఎలా చేర్చుకున్నారన్న ప్రశ్నను ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రధానం గా ముందుకు తీసుకవస్తున్నారు.


ఎయిర్ పోర్టుకు వెళ్తున్న జీవన్ రెడ్డి

బుజ్జగింపు ఎలా?

అసంతృప్తితో ఉన్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని ఏఐసీసీ నేతలు ఎలా బుజ్జగిస్తారన్న అంశంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో అధిష్ఠానం పలు అంశాలను ముందుకు తీసుకవచ్చే అవకాశాలున్నాయి. అసంతృప్తితో ఉన్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తానని, కాంగ్రెస్‌లో కొనసాగుతానని ఇప్పటికే ప్రకటించారు. ఈ నేపథ్యంలో జీవన్‌రెడ్డి ఏదో ఒక మంత్రి పదవిగానీ, కార్పొరేషన్ పదవిని గానీ, ఇతర రాజ్యాంగ పరమైన బాధ్యతలుగానీ, పార్టీలో కీలక పదవినిగానీ ఇచ్చి సంతృప్తి పరిచే అవకాశాలున్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

కాంగ్రెస్ శ్రేణుల్లో అసంతృప్తి

ప్రస్తుత పరిస్థితి జగిత్యాల కాంగ్రెస్ శ్రేణుల్లో అసంతృప్తిని కలి గించింది. సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంపై జగిత్యాల నేతల్లో తీవ్రంగా చర్చ జరుగుతోంది. సీనియర్ నేతను అగౌరవ పరిచే విధంగా చేరిక వ్యవహారం జరిగిందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వర్గీయులు పేర్కొంటుండగా, ముఖ్యమంత్రిగా, రాష్ట్ర పార్టీ నేతగా రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉండాలన్న అభిప్రాయాన్ని మరి కొందరు కాంగ్రెస్ నేతలు అంతర్గతంగా చర్చించుకుంటున్నారు. ఏకంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం వివాదానికి దారి తీయడం, ఇది ఏ విధంగా పరిష్కారం అవుతుందోనని కాంగ్రెస్ కార్యకర్తలు ఎదురు చూస్తున్నారు.

పార్టీలోనే ఉంటా.. కలిసి పనిచేస్తా

- ఢిల్లీలో ప్రకటించిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్‌ను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవడంతో మనస్తాపానికి గురై ఎమ్మెల్సీ పదవికి రాజీనామాకు సిద్ధమైన కాంగ్రెస్ సీనియర్ నేత తాటిపర్తి జీవన్‌రెడ్డి బుధవారం ఏఐసీసీ నేతల బుజ్జగింపుతో కొంత శాంతించారు. కాంగ్రెస్ పార్టీని వీడేది లేదని, రాహుల్‌గాంధీ నేతృత్వంలో నాయకులు అందరితో కలిసి పనిచేస్తామని ప్రకటించారు. జగిత్యాల నియోజకవర్గానికి సంబంధించి జరుగుతున్న పరిణామాలపై రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ ఢిల్లీకి రావాలని తనను కోరారని తెలిపారు. జగిత్యాలలో చోటు చేసుకున్న పరిణామాలతో మనస్తాపానికి గురైనట్లు తెలిపారు. కార్యకర్తల మనో భావాలను, ఆవేదనను పరిగణలోకి తీసుకుంటామని, పార్టీకి అండగా నిలిచిన వారిని విస్మరించమని ఏఐసీసీ కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ప్రకటించడం స్వాగతిస్తున్నామన్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తెలంగాణ భవన్‌లో రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో భేటీ అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఏ పార్టీకి అయినా క్యాడర్ ముఖ్యమని, వారి ఆలోచనలకు అనుగుణంగానే నిర్ణయాలు తీసుకోవడం సముచితమని వ్యాఖ్యానించారు. రాజకీయ పరిణామాలు, పరిస్థితులకు అనుగుణంగా కొన్ని నిర్ణయాలు తప్పవని, మొదటి నుంచి పార్టీలో ఉన్న వారికి ప్రాధాన్యత, గౌరవం ఇస్తామని ఏఐసీసీ కార్యదర్శి వేణుగోపాల్ హామీ ఇచ్చారని వెల్లడించారు. ఢిల్లీలో ఏఐసీసీ కార్యదర్శి కేసీ వేణుగోపాల్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీలతో జరిగిన భేటీలో పలు అంశాలు చర్చల్లోకి వచ్చాయన్నారు.

మహిళాశక్తి యూనిట్లు నెలకొల్పేందుకు కృషి చేయాలి

- జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ విజయలక్ష్మి

జగిత్యాలరూరల్, జూన్ 26: రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాల ఆర్థిక బలోపేతానికి మహిళాశక్తి అనే కార్యక్రమం ద్వారా వివిధ యూనిట్ల ఏర్పాటుకు కృషి చేస్తుందని, దీని కోసం గ్రామ సమాఖ్య సభ్యులు, ఐకేపీ సిబ్బంది కృషి చేయాలని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ విజయలక్ష్మీ అన్నారు. బుధవారం జగిత్యాల మండల ఐకేపీ కార్యాలయంలో రూరల్, అర్బన్ మండలాల మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ మహిళా సంఘాలవారు ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం మహిళశక్తి క్యాంటీన్లు, ఈవెంట్ మేనేజ్‌మెంట్, హోంఫుడ్ యూనిట్లు, మిల్క్ అవుట్‌లెట్‌కేంద్రాలు, పాడిగేదెల కొనుగోలు, మీసేవాకేంద్రాలు, ఎంటర్‌ప్రైజెస్ తదితర యూనిట్లు ఏర్పాటు చేస్తుందన్నారు. కార్యక్రమంలో డీపీఎం వెంకటేశం, ఏపీఎం ఓదెల గంగాధర్, డీ.ఎం.జీ దేవయ్య, సీసీలు గంగారాం, సాగర్, రవీందర్, శ్రీనివాస్, మరియా, స్త్రీనిధి మేనేజర్లు రాణి ఉన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ముఖ్య అతిథులు

రాయికల్, జూన్ 26: మండలంలోని ఇటిక్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను బుధవారం ఘనంగా సన్మానించారు. పాఠశాలలో పనిచేస్తున్న చెరుకు మహేశ్వరశర్మ, వంగంపల్లి సంపత్ కుమార్, వేముల మధు, నీలి నాగరాజు, మైదం శాంతకుమారి, నిక్కత్ సుల్తానా, శాంతయ్యలను శాలువాలతో సత్కరించి సన్మాన పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు పాఠశాలకు చేసిన సేవలను పలువురు కొనియాడారు. ఆర్‌యూపీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వేల్పుల స్వామి యాదవ్ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు, ముఖ్య అతిథితులకు భగవద్గీతలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు సదాశివ్, ఎంపీటీసీ రాధఆదిరెడ్డి, తాజా మాజీ సర్పంచ్ సామల్ల లావణ్య వేణు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్ పర్సన్ తాలుక లావణ్య, గాజెంగి రాజేశం, ముక్కెర శేఖర్, హన్మంత రావు, జియావుద్దీన్, శ్రీలత, కిషోర్ పాల్గొన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్


మంత్రి పొన్నంను కలిసిన ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను బుధవారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ కలిశారు. హైద్రాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందించారు. ఇటీవల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు జగిత్యాల నియోజకవర్గానికి చెందిన పలు సమస్యలను వివరించారు.

లోకల్ బాడీ అదనపు కలెక్టర్‌గా జడ్పీ డిప్యూటీ సీఈవో రఘువరన్

జగిత్యాల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా లోకల్ బాడీ అదనపు కలెక్టర్‌గా జడ్పీ డిప్యూటీ సీఈవో రఘువరన్‌కు ఫుల్ అడిషనల్ చార్జీ అప్పగిస్తూ బుధవారం కలెక్టర్ సత్యప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న లోకల్ బాడీ అదనపు కలెక్టర్ టీఎస్ దివాకర పదోన్నతిపై ఇటీవల ములుగు జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయి వెళ్లారు. దీంతో గత కొన్ని రోజులుగా లోకల్ బాడీ అదనపు కలెక్టర్‌గా అదనపు కలెక్టర్ పర్స రాంబాబు వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో జడ్పీ డిప్యూటీ సీఈఓగా వ్యవహరిస్తున్న రఘువరన్‌కు లోకల్ బాడీ అదనపు కలెక్టర్‌గా ఫుల్ అడిషనల్ చార్జీని అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి


రాయికల్‌లో పర్యటిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్


అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

- కలెక్టర్ సత్యప్రసాద్

రాయికల్, జూన్ 26: ప్రభుత్వ ఉపాధ్యాయులు పిల్లలకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. రాయికల్ మండలంలోని అల్లీపూర్ గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ సెంటర్, ఎంపీపీఎస్ పాఠశాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంత మంది విద్యార్థులు పాఠశాలకు వస్తున్నారని, పిల్లలకు అర్థమయ్యే విధంగా నాణ్యమైన చదువు నేర్పిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకు యూనిఫారం ఎందుకు పంపిణీ చేయాలని, వెంటనే పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. టాయిలెట్స్ నిర్మాణం పూర్తి చేయకుండా మధ్యలో ఎందుకు వదిలేశారని, వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ పంచాయతీ ద్వారా మందులు దేనికోసం ఇస్తున్నారు, బీపీ, షుగర్ వ్యాధి ఉన్నవారికి మందులు పంపిణీ చేస్తున్నారా, వారికి సంబంధించిన టెస్టులు నిర్వహిస్తున్నారా లేదా అని పల్లె డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీలో రికార్డుల నమోదు సరిగా ఉన్నాయా లేదా అని రికార్డులను పరిశీలించారు. హరితహారంలో భాగంగా నర్సరీ మొక్కలను కలెక్టర్ పరిశీలించి మొక్కల పంపిణీ ఏ విధంగా జరుగుతుందని, ఇంట్లో పెంచుకునే మొక్కలు ఏమేమి ఉన్నాయి అని అడిగి తెలుసుకున్నారు. మొక్కలకు నీరు పోసి సంరక్షించాలని అధికారులకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి రిజిస్టర్ నమోదు చేస్తున్నారా లేదా అని పరిశీలించారు. రోజువారీగా ఇచ్చే ఆహార మెనూ, పొడవు, బరువు కొలతలు, బాలామృతం పంపిణీ సక్రమంగా నిర్వహించాలని అన్నారు. టాయిలెట్స్ ఎప్పటికప్పుడు శానిటేషన్ చేయించాలని, వెలుతురు కూడా సరిగా లేదని, చీకటిగా ఉందని, పిల్లలకు ఇబ్బంది కలుగుతుందని వెంటనే తగిన మరమ్మతులు చేయడానికి ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను పరిశీలించి సిబ్బంది, స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాయికల్ మున్సిపాలిటీలో డ్రైనేజీ వ్యవస్థను, కాలనీలను కలెక్టర్ పరిశీలించారు. ముంపు ప్రాంతాల్లో గల ఇళ్లను పరిశీలించారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని నీటి నిల్వలు ఉండకుండా, ఇళ్లల్లోకి నీరు వెళ్లకుండా నీటిని దారి మళ్లించి పెద్ద డ్రైనేజీని నిర్మించడానికి తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే బోర్నపెల్లిలో ఇసుక డంపును కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్, డిప్యూటీ సీఈవో రఘువరన్, మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, తహసీల్దార్ ఖయ్యాం, ఎంపీడీవో చిరంజీవి, ఎంపీవో సుష్మా తదితరులు పాల్గొన్నారు.

ముంపు కాలనీలను పరిశీలించిన కలెక్టర్

రాయికల్ పట్టణంలో వర్షాకాలంలో యేటా వర్షాకాలంలో ముంపుకు గురవుతున్న కాలనీలపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'ముందు చూపేదీ' కథనానికి కలెక్టర్ స్పందించారు. రాయికల్ పట్టణంలో ముంపుకు గురయ్యే 6వ వార్డును జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలించారు. పట్టణంలో ముంపుకు గురయ్యే 5,6,7 వార్డులలో తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భీమన్నవాడ, మత్తడి వాడ, గొల్లవాడ, కేశవనగర్ కాలనీలు ముంపుకు గురి కాకుండా చర్యలు చేపట్టి, అంచనాలు తయారు చేయాలని ఆదేశించారు. ఇళ్లలోకి నీరు వెళ్లకుండా నీటిని దారి మళ్లించి పెద్ద డ్రైనేజీని నిర్మించడానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

అక్రమంగా టెండర్లు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు : ఆర్డీవో


అధికారులకు సూచనలు చేస్తున్న ఆర్డీవో ఆనంద్ కుమార్

కోరుట్ల రూరల్, జూన్ 26 : గ్రామాలలో వీడీసీ సభ్యులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా టెండర్లు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆర్డీవో ఆనంద్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని నాగులపేట గ్రామంలో ఇసుక కుప్పలను పరిశీలించారు. పైడిమడుగు గ్రామంలో అక్రమంగా నిలువ ఉన్న 10 ఇసుక కుప్పలను ఆర్డీఓ ఆధ్వర్యంలో రెవెన్యూ, మైనింగ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నాగులపేట గ్రామంలో నిర్వహించిన ఇసుక వేలంలో 3,58,000 రూపాయలు సమకూరినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. బహిరంగ వేలంపై ఆర్డీవో అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాలలో అక్రమంగా ఇసుక రవాణా, బెల్ట్ షాపులకు టెండర్లు వేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. మెట్‌పల్లి డీఎస్‌పీ ఉమామహేశ్వర్‌రావుకు ఫోన్ ద్వారా మాట్లాడి గ్రామాలలో పోలీసు సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహించి ఇసుక అక్రమ రవాణ అరికట్టాలని సూచించారు. నాగులపేట, పైడిమడుగు కథలాపూర్ మండలంలోని తక్కలపల్లి శివారులో ఉన్న వాగులోకి టాక్టర్ పోకుండా కందకాలు తీయాలని సూచించారు. ట్రాక్టర్లను ఇసుక రవాణాకు ఉపయోగిస్తే సీజ్ చేసే అధికారం రవాణాశాఖ అధికారులకు ఉంటుందని అన్నారు. తహసీల్దార్ కిషన్, ఎంపీడీఓ రామకృష్ణ ఉన్నారు.

పారిశుధ్య పనులు పకడ్బందీగా నిర్వహించాలి

- జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్


సమీక్షలో పాల్గొన్న అధికారులు


మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్

జగిత్యాల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో పారిశుధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలని జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలోని జడ్పీ కార్యాలయంలో జిల్లాలోని పలువురు ఎంపీడీఓలు, ఇతర అధికారులతో సీజనల్ వ్యాధుల నివారణ, పారిశుధ్యం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రస్తుత వర్షాకాలం సీజన్‌లో పారిశుధ్యం నిర్వహణపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు సానిటేషన్ చేయాలన్నారు. రాష్ట్రంలో జగిత్యాల జిల్లా పరిశుభ్రతలో ప్రథమ స్థానంలో ఉండే విదంగా ప్రతి మండల అధికారి కృషి చేయాలని కోరారు. గ్రామాల్లో మత్తు పదార్థాల నివారణలో ఎంపీడీఓలు ప్రధాన పాత్ర పోషించాలని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ రఘువరన్, ఎంపీడీఓలు, జడ్పీ ఉద్యోగులు పాల్గొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి

కరీంనగర్ క్రైం, జూన్ 26 : కరీంనగర్ లోయర్ మానేర్ డ్యాం నీటి గుంతలో ఒక యువకుడు అనుమానాస్పదంగా మృతి చెంది ఉన్నాడని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం చింతకుంటలోని గ్రీన్‌హోమ్స్‌లో నివాసం ఉంటున్న సామ శివారెడ్డి(26) మంగళవారం రాత్రి పద్మనగర్ ప్రాంతంలోని ఒక ప్రైవేట్ స్కూల్ వెనుక వైపున జలాశయంలోని పెద్ద నీటి గుంతలో పడి మృతి చెంది ఉన్నాడు. చింతకుంటలో తన తండ్రి నిర్వహిస్తున్న సర్వీసింగ్ సెంటర్‌లో ఉన్న శివారెడ్డిని మంగళవారం సాయంత్రం 5గంటల ప్రాంతంలో అతడి స్నేహితుడు నిశాంత్ బైక్‌పై తీసుకు పోయాడని, ఆ తరువాత 8 గంటల ప్రాంతంలో శివా రెడ్డికి తన తల్లి ఫోన్ చేయగా అరగంటలో వస్తున్నట్లు తెలిపాడని, మళ్లీ 9:15 గంటలకు ఫోన్ చేసినట్లు మృతుడి తండ్రి సత్యారెడ్డి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కొద్దిసేపటి తరువాత మృతుడి సోదరుడు ఉదయ్‌రెడ్డికి నిశాంత్ అనే యువకుడు ఫోన్ చేసి శివారెడ్డి ప్రమాదవశాత్తు నీటి గుంతలో జారి పడి మృతి చెందాడని చెప్పినట్లు తెలిపారు. వెంటనే కుటుంబ సభ్యులంతా సంఘటనా స్థలానికి వెళ్లి అక్కడ ఉన్న శివారెడ్డి స్నేహితులను అడగగా సరైన సమాధానం ఇవ్వలేదని, శివారెడ్డికి ఈతవచ్చని పేర్కొన్నారు. గతంలో నిశాంత్‌కు శివారెడ్డికి మధ్య డబ్బుల గొడవ ఉందని, తన కొడుకు మరణంపై అనుమానాలున్నాయని మృతుడి తండ్రి సత్యారెడ్డి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతుడు శివారెడ్డి హైదరాబాద్‌లో ఒక కృత్రిమ అవయవాల తయారీ సంస్థలో పనిచేస్తున్నాడని, రెండు రోజుల కిందటే చింతకుంటకు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. శివారెడ్డితో పాటు సంఘటన స్థలంలో ఉన్న అతడి స్నేహితులు ముగ్గురు ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని సీఐ ప్రదీప్‌కుమార్ తెలిపారు.


శివారెడ్డి (ఫైల్)

బీఫార్మసీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, జూన్ 26: శాతవాహన విశ్వవిద్యాలయంలో మేలో నిర్వహించిన బీఫార్మసీ (సీబీసీఎస్) 3,4,5,6, సెమిస్టర్ల ఫలితాలను బుధవారం విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్వీ శ్రీరంగ ప్రసాద్ తెలిపారు. పరీక్షల ఫలితాలు శాతవాహన యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

డిగ్రీ పరీక్షల్లో 12 మంది విద్యార్థులు డీబార్

గణేశ్‌నగర్, జూన్ 26: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ, రెండో, నాలుగవ, సెమిస్టర్ పరీక్షల్లో బుధవారం 12మంది విద్యార్థులు డీబార్ అయినట్లు శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్వీ శ్రీరంగప్రసాద్ తెలిపారు. స్వామి వివేకానంద డిగ్రీ కళాశాల ధర్మరాంలో ముగ్గురు, ప్రభుత్వం డిగ్రీ కళాశాల, కోరుట్లలో ఒకరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల హుజూరాబాద్‌లో ఒకరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల మెట్‌పల్లిలో ఒకరు, ప్రభుత్వం డిగ్రీ కళాశాల మహదేవ పూర్‌లో ఆరుగురు విద్యార్థులను డీబార్ చేసినట్లు తెలిపారు.

ఎలక్ట్రానిక్ దుకాణంలో షార్ట్ సర్క్యూట్
రూ. 3 లక్షల సామగ్రి దగ్ధం

కోరుట్ల, జూన్ 26 : పట్టణంలోని గాంధీ రోడ్డులోని ఎలక్ట్రానిక్ దుకాణంలో షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం అయినట్లు దుకాణం యజమాని ఎడ్డెలి సత్యనారాయణ తెలిపారు. బుధవారం మధ్యాహ్నం షాపులో ఉన్న సామగ్రి నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగినట్లు తెలిపారు. స్థానికులు గమనించి మంటలను ఆర్పివేయడంతో ప్రమాదం తప్పిందన్నారు. సుమారు రూ.3 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు యజమాని సత్యనారాయణ తెలిపారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

సుభాష్‌నగర్, జూన్ 26: గన్నేరువరం మండలం పచ్చునూర్ గ్రామానికి చెందిన వడ్లకొండ వీరయ్య బుధవారం ఉదయం తాటి చెట్టు ఎక్కి కాలుజారి కిందపడగా తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని వెంటనే కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తర లించి మెరుగైన చికిత్స కోసం చల్మెడ ఆనందరావు ఆసుపత్రిలో చేర్పించారు. వీర య్యను సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కోడూరి పరశురాంగౌడ్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్యగౌడ్‌లు పరామర్శించారు.

నకిలీ వీసాతో మోసం

● పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు
● కేసు నమోదు చేసిన పోలీసులు

మల్యాల, జూన్ 26: నకిలీ వీసాతో మోసం చేసిన హైదరాబాద్‌కు చెందిన ఒకరిపై కేసు నమోదు చేసినట్లు మల్యాల ఎస్సై-2 కుమారస్వామి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మల్యాల మండలం తక్కళ్లపల్లికి చెందిన జుట్టు శ్రీకాంత్‌ను ఉద్యోగం కోసం పోలండ్ పంపిస్తామని హైదరాబాద్‌కు చెందిన మావిల్లపల్లి అభిలాస్‌రెడ్డి అనే వ్యక్తి రూ.3లక్షలు తీసుకున్నాడు. అక్కడ ప్రస్తుతం ఉద్యోగాలు లేవని ఫ్రాన్స్ పంపిస్తానని చెప్పి నకిలీ వీసా అప్పగించి మరో రూ.50వేలు వసూలు చేశాడు. అయితే ఆ వీసాతో ఈ నెల 12న ముంబైలోని ఏయిర్‌పోర్టుకు వెళ్లగా అక్కడ ఇమ్మిగ్రేషన్ అధికారులు అది నకిలీ వీసా అని శ్రీకాంత్‌ను పోలీసులకు అప్పగించారు. దీంతో అతను ఇప్పుడు జైల్‌లో ఉండగా అభిలాష్‌రెడ్డిపై అతని తండ్రి లింగారెడ్డి మల్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు అభిలాష్‌రెడ్డిపై ఇమ్మిగ్రేషన్ యాక్టు కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. శ్రీకాంత్‌తో పాటు మల్యాలకు చెందిన రఫీక్‌ఖాన్, ముదాం నాగరాజ్‌తో పాటు పలువురిని మోసం చేసినట్లు ఫిర్యాదులు ఉన్నాయని దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

గుడంబా స్థావరాలపై పోలీసుల దాడులు


గుడంబా బట్టీని ధ్వంసం చేస్తున్న ఎస్ఐ సందీప్‌కుమార్, సిబ్బంది

రామగిరి, జూన్ 26: మండలంలోని బేగంపేట్ గ్రామశివారులోని కంచల చెరువు సమీపంలో ఏర్పాటు చేసిన గుడంబా స్థావరాలపై ఎస్ఐ సందీప్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం దాడులు చేశారు. ఈ దాడుల్లో 12వేల లీటర్ల బెల్లం పానకం, సామగ్రిని ధ్వంసం చేశారు. గుడంబా తయారు చేసి, విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. హెడ్‌కానిస్టేబుల్ రాంబాబు, కాని స్టేబుల్స్ సదానందం, రవి తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో నిందితుడి రిమాండ్

మెట్‌పల్లి, జూన్, 26: ఓ యువతిపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని రిమాండ్‌కు తరలించి నట్లు బుధవారం ఎస్సై చిరంజీవి తెలిపారు. కోరుట్ల పట్టణానికి చెందిన మహ్మద్ జుబేర్‌ఖాన్ ఓ యువతిపై అత్యాచారానికి పాల్పడినట్లు ఈ నెల 24న మెట్‌పల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు అందినట్లు తెలిపారు. సీఐ నిరంజన్‌రెడ్డి విచారణ చేపట్టి జుబేర్‌ఖాన్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

భార్య ఆత్మహత్యకు కారకుడైన వ్యక్తికి జైలు శిక్ష

కరీంనగర్ లీగల్, జూన్ 26: భర్త వేధింపులు భరించలేక ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న కేసులో నిందితుడైన భర్త మాధవరావు సుమన్ (38)కు మూడు సంవత్సరాల జైలు శిక్ష, 2 వేల రూపాయల జరిమానా విధిస్తూ కరీంనగర్ ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జ్ ఆర్ శ్రీలేఖ బుధవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం గుంటూరు జిల్లా తెనాలి మర్సిపేటకు చెందిన మన్నవరాణిని అదే జిల్లా వేమురు మండలం వరాహపురంకు చెందిన మాధవరం సుమన్‌తో 2012లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. 2017లో బతుకుదెరువు కోసం గంగాధర మండలం గర్షకుర్తికి వచ్చి స్థిరపడ్డారు. కొద్ది రోజుల తర్వాత తాగుడుకు బానిసై భార్యను వేధించడంతో ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ కేసులో సాక్షులను విచారించిన జడ్జి శ్రీలేఖ నిందితుడికి జైలు శిక్ష విధించారు.

వృద్ధుడి ఆత్మహత్య

పెగడపల్లి,జూన్ 26: పెగడపల్లి మండలంలోని కీచులాటపల్లి గ్రామానికి చెందిన మారుపాక లచ్చయ్య (70) అనే వృద్ధుడు బుధవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. లచ్చయ్య కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఎన్ని మందులు వాడినా వ్యాధి నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఇంటి ఎదుట గల గుడిసెలో ఉరివేసుకుని మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


గంగాధర్ (ఫైల్)

పెగడపల్లి, జూన్ 26: పెగడపల్లి మండలంలోని బతికెపల్లి శివారులో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సుద్దపల్లి గ్రామానికి చెందిన బలుసు గంగాధర్ (31), ముంజ రాజు అనే యువకులు ఇరువురు ద్విచక్ర వాహనంపై పెగడపల్లి నుంచి సుద్దపెల్లికి వెళ్తుండగా బతికెపల్లి గ్రామ శివారులోని సుద్దపల్లి లింగాపూర్ గ్రామాలకు వెళ్లే నాలుగు రోడ్ల కూడలిలలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయాల పాలైన ఇద్దరిని గ్రామస్థులు జగిత్యాల ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే బలుసు గంగాధర్ మృతి చెందినట్లు తెలిపారు. ముంజ రాజు పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ద్విచక్ర వాహనాన్ని టాటా ఏస్ ట్రక్ ఢీకొట్టినట్లు ప్రచారం జరుగుతోంది. సంఘటనా స్థలాన్ని ఎస్.ఐ రామకృష్ణ సందర్శించి, ప్రమాదానికి కారణమైన వాహన ఆచూకీ కోసం సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

భవనంపై నుంచి పడి..

కరీంనగర్ క్రైం, జూన్ 26: సుభాష్‌నగర్‌లో మంగళవారం రాత్రి భవనంపై నుంచి ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడి పులి సుమన్ కుమార్(40) మృతి చెందాడని మూడో ఠాణా పోలీసులు తెలిపారు. ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న సుమన్‌కుమార్ మంగళవారం సాయంత్రం భార్య, పిల్లలతో రేకుర్తిలోని బంధువుల ఇంటికి వెళ్లి రాత్రి 11 గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చారు. ఇంటి ట్యాంక్‌లో నీరు లేకపోవటంతో మోటార్ ఆన్ చేసి, రెండో అంతస్థులోని ట్యాంక్ నిండిందో లేదో చూసి కిందకు దిగే క్రమంలో నీటి పాకురుతో ఉన్న చోట కాలు జారి కింద పడిపోయాడని మృతుడి తండ్రి రిటైర్డ్ ఎస్ఐ పులి నర్సింగం ఫిర్యాదు చేశారు. తీవ్ర గాయాలతో ఆసుపత్రికి తరలించగా బుధవారం తెల్లవారు జామున 2 గంటల ప్రాంతంలో మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

జగిత్యాలలో పర్మిట్ రూం వద్ద
మందుబాబుల వీరంగం
ఒకరిపై కత్తితో దాడి

జగిత్యాల టౌన్, జూన్ 26: జగిత్యాల జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్‌లో ఉన్న ఓ వైన్స్ పర్మిట్ రూం వద్ద మందుబాబులు వీరంగం సృష్టించారు. పర్మిట్ రూం నిర్వహించే వ్యక్తిపై కూరగాయలు కోసే కత్తితో దాడి చేయగా స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్‌లో ఉన్న ఓ వైన్స్ పర్మిట్ రూంలోకి పట్టణానికి చెందిన శేఖర్, పుల్లయ్య అనే ఇద్దరు వెళ్లి మద్యం సేవించారు. పర్మిట్ రూంలో ఉన్న కొంత ఫుడ్‌ను తీసుకున్నారు. అతిగా మద్యం సేవించిన అనంతరం బయటకు వెలుతున్న శేఖర్‌ను పర్మిట్ రూం నిర్వాహకుడు బిల్లు చెల్లించాలని కోరగా శేఖర్‌తో పాటు పుల్లయ్య అనే ఇద్దరు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. కౌంటర్‌పై ఉన్న కురగాయలు కోసే కత్తితో బెదిరించి దాడికి పాల్పడడంతో నిర్వాహకుడు రాకేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బైక్‌ల దొంగ అరెస్ట్

సిద్దిపేట క్రైం, జూన్ 26: సిద్దిపేట పట్టణంలో అంతర్ జిల్లా బైక్ దొంగను, అరెస్ట్ చేసి 19 బైకులను వన్ టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి అనురాధ వెల్లడించారు. పట్టణంలోని పాత బస్టాండ్ చౌరస్తాలో బుధవారం వన్ టౌన్ పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా నిజామాబాద్ జిల్లా మక్లూరు మండలం ధర్మారం గ్రామానికి చెందిన కుమ్మరి సాయి కుమార్ అనుమానాస్పదంగా కనపించాడన్నారు. అదుపులోకి తీసుకుని విచారించగా అతడు పలు జిల్లాల్లో బైక్ దొంగతనాలకు పాల్పడినట్లు తేలిందన్నారు. అతడు కరీంనగర్ జిల్లా పరిధిలో మూడు, జగిత్యాల జిల్లా పరిధిలో ఒకటి, రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలో ఒక బైక్ దొంగిలించాడని సీపీ తెలిపారు.

29 నుంచి హెచ్‌సీఏ ఉమెన్స్ లీగ్ ఓపెన్ సెలెక్షన్స్

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 26: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే హెచ్‌సీఏ ఉమెన్స్ లీగ్ ఓపెన్ సెలక్షన్స్‌ను ఈనెల 29,30 తేదీల్లో నిర్వహించనున్నారని ఉమ్మడి కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వి.ఆగంరావు, మురళీధర్ రావులు తెలిపారు. హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నారని తెలిపారు. పోటీల్లో పాల్గొనుటకు ఆసక్తిగల ఉమ్మడి జిల్లా మహిళా క్రీడాకారులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవలసి ఉంటుందని పేర్కొన్నారు. హెచ్‌సీఏ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని పూర్తి యూనిఫాం, క్రికెట్ కిట్ బ్యాగ్‌తో ఉప్పల్ స్టేడియంలో రిపోర్ట్ చేయాలని వారు పేర్కొన్నారు.

గురుకుల అభ్యర్థుల సమస్యలు పరిష్కరించాలి

» సర్కార్‌కు వారి బాధలు కనిపించట్లేదా?: హరీశ్‌రావు

హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలే పరమావధిగా నడుస్తున్న ప్రజా ప్రభుత్వానికి గురుకుల టీచర్ పోస్టుల అభ్యర్థుల బాధలు కనిపించకపోవడం బాధాకరమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మంత్రులు, అధికారులను కలిసి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా.. సీఎం ఇంటి ముందు మోకాళ్ల మీద నిలబడి అభ్యర్థించినా గురుకుల అభ్యర్థుల మొర ఆలకించకపోవడం శోచనీయమన్నారు. బుధవారం ఆయన 'ఎక్స్' వేదికగా గురుకుల అభ్యర్థుల నిరసనకు మద్దతు ప్రకటించారు. వారి సమస్యలను తక్షణం పరిష్కరించాలని బీఆర్ఎస్ తరఫున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోస్టులు బ్యాక్‌లాగ్ కాకుండా రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం అన్నింటినీ భర్తీ చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాగా, కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీలో నెలకొన్న ఇబ్బందులను పరిష్కరించేందుకు జీవో46ను సవరించాలని బీఆర్ఎస్ నేత రాకేశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. జీవో46కు సంబధించిన కేసు విచారణను అడ్వకేట్ జనరల్ ఉద్దేశపూర్వకంగా వాయిదా వేయించారని ఆరోపించారు.

కేసీఆర్ భూముల కోసమే అలైన్‌మెంట్ మార్చారు

» 'ఆర్ఆర్ఆర్' భూనిర్వాసితుల ఐక్య వేదిక

గజ్వేల్, జూన్ 26: తన భూముల విలువ పెంచుకునేందుకే మాజీ సీఎం కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు రీజినల్ రింగ్‌రోడ్డు (ఆర్ఆర్ఆర్) అలైన్‌మెంట్‌ను మార్చారని భూనిర్వాసితుల ఐక్య వేదిక నేతలు మండిపడ్డారు. ఈ అలైన్‌మెంట్‌ను మార్చాల్సిందేనంటూ వారు డిమాండ్ చేశారు. బుధవారం గజ్వేల్‌లో ఆర్ఆర్ఆర్ భూనిర్వాసితులు ర్యాలీ, ధర్నా నిర్వహించారు. అనంతరం గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇప్పటికే తమ భూముల నుంచి కొండపోచమ్మ సాగర్ కాలువలు వెళ్లాయని వెళ్లాయని, ఇప్పుడు రీజినల్ రింగ్ రోడ్డు వెళ్తే.. ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూములకు ఆర్డీవో ఎకరాకు రూ.7.50లక్షలు మాత్రమే ఇస్తామంటున్నారని, ఆ డబ్బుతో ఏం వస్తుందని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల ముందు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసినప్పుడు తమకు న్యాయం చేస్తామన్నారని, ఇప్పుడు టెండర్లను పిలుస్తున్నట్లు ప్రకటించడం సరికాదని ఆక్షేపించారు. ఇప్పటికే ఉన్న చిట్యాల-సంగారెడ్డి 161 జాతీయ రహదారినే రీజినల్ రింగ్ రోడ్డుగా మార్చాలని డిమాండ్ చేశారు.

రుణమాఫీకి షరతులు..వెన్నుపోటే: కిసాన్‌మోర్చా

హైదరాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ప్రారంభ, ముగింపు తేదీలు అంటూ షరతులు విధించడం.. రైతులకు వెన్నుపోటు పొడవడమేనని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్ రెడ్డి విమర్శించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం జరిగిన రాష్ట్ర పదాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.2లక్షల రుణమాఫీపై తుక్కుగూడ సభలో రాహుల్ గాంధీతో హామీ ఇప్పించారని, దాన్ని అమలు చేయకపోతే ప్రజలే ఆ పార్టీ నేతల తుక్కు రేగ్గొడతారని హెచ్చరించారు. ఖరీఫ్‌లో పెట్టుబడికి డబ్బులు లేక రైతులు అల్లాడుతుంటే... అభిప్రాయ సేకరణ అంటూ ఆటలాడుతున్నారని మండిపడ్డారు. షరతులు లేకుండా రుణమాఫీ అమలు చేయాలని, లేదంటే బీజేపీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు.

పెన్షనర్ల సమస్యలపై ఉద్యమిస్తాం: జేఏసీ

సమస్యల పరిష్కారం కోసం జూలై నుంచి ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల జేఏసీ వెల్లడించింది. ఈ మేరకు బుధవారం సీఎస్‌కు నోటీసు అందజేసినట్లు జేఏసీ ఛైర్మన్ కె.లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి శుభాకర్‌రావు తెలిపారు. పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి అనేక సందర్భాల్లో వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. ఈ మేరకు జూలై 15న అన్ని జిల్లా కేంద్రాల్లో సమావేశాలు పెట్టి కలెక్టర్లకు వినతిపత్రాలు ఇస్తామని వెల్లడించారు. వేలాది మంది పెన్షనర్లతో జూలై 30న ఇందిరాపార్కు వద్ద మౌనదీక్ష చేస్తామని తెలిపారు.

అవినీతికి పాల్పడలేదని పొన్నం చెప్పగలరా?

» మంత్రుల అవినీతిని బ్లాక్ బుక్‌లో నమోదు చేస్తున్నాం

» బీఆర్ఎస్ మళ్లీ వచ్చాక ఎవర్నీ వదిలిపెట్టం: కౌశిక్‌రెడ్డి

బంజారాహిల్స్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అవినీతికి పాల్పడలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ దేవుడిపై ప్రమాణం చేస్తారా? అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నిలదీశారు. ఆయన ప్రమాణం చేస్తే క్షమాపణ చెప్పేందుకు తాను సిద్ధమని ప్రకటించారు. ఫ్లై యాష్ తరలింపులో మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.100 కోట్ల మేర అవినీతికి పాల్పడ్డారని ఆరోపించిన కౌశిక్‌రెడ్డి.. జూబ్లీహిల్స్ టీటీడీ ఆలయానికి వస్తే నిరూపిస్తానని సవాల్ విసిరారు. ఈ మేరకు బుధవారం టీటీడీ ఆలయానికి వచ్చిన కౌశిక్‌రెడ్డి.. అక్కడ మీడియాతో మాట్లాడారు. తన ఆరోపణలపై మంత్రి పొన్నం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. లీగల్ నోటీసులు పంపిస్తే భయపడేది లేదని స్పష్టం చేశారు. ఫ్లై యాష్ లారీలను తానే స్వయంగా హుజూరాబాద్‌లో పట్టుకున్నానని, వే బ్రిడ్జికి తరలించి తూకం వేస్తే 76 టన్నులు పైగా తీసుకెళ్తున్నట్లు తేలిందన్నారు. నిబంధనల ప్రకారం 16 టైర్ల లారీలో 36 టన్నులు మాత్రమే తీసుకువెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. ఈ వ్యవహారంలో రవాణా శాఖ మంత్రికి సంబంధం లేదా?అని ప్రశ్నించారు. మంత్రుల అవినీతిని బ్లాక్ బుక్‌లో నమోదు చేస్తున్నట్టు, మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ఎవరినీ వదిలేది లేదని హెచ్చరించారు.



ప్రధాని మోదీని కలిసిన బండారు దత్తాత్రేయ, కుటుంబ సభ్యులు

మోదీకి గవర్నర్ దత్తాత్రేయ అభినందనలు

న్యూఢిల్లీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నరేంద్ర మోదీకి హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అభినందనలు తెలిపారు. బుధవారం ఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో ప్రధాని మోదీని దత్తాత్రేయ కుటుంబ సభ్యులతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కృష్ణభగవానుని 'విరాట్ స్వరూప్' విగ్రహాన్ని ప్రధానికి బహూకరించారు. గవర్నర్ సతీమణి బండారు వసంత, కుమార్తె బండారు విజయలక్ష్మి, అల్లుడు, డాక్టర్ బి.జిగ్నేష్ రెడ్డి, బండారు శివశంకర్, మనవరాళ్లు యశోధర రెడ్డి, వేదాంషి రెడ్డిలు మోదీకి శుభాకాంక్షలు తెలిపారు. యశోధర, వేదాంషి ప్రధాని కోసం రెండు పాటలు పాడగా.. మోదీ వారిని ప్రత్యేకంగా అభినందించి, ఆశీర్వదించారు. మరోవైపు.. ప్రధానిమోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాను త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనా రెడ్డి కలిశారు.

మేడిగడ్డ డిజైన్ ఒకటైతే..నిర్మాణం మరోరకంగా

» తుమ్మిడి హెట్టిని పునఃపరిశీలించాలి: కోదండరాం

హైదరాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ ప్రాజెక్టు డిజైన్ ఒకటైతే నిర్మాణం మరోరకంగా చేశారని, అందుకే అది కుంగిందని టీజేఎస్ అధినేత కోదండరాం అన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యత లేదని, నిర్వహణ కూడా సరిగా లేదని ఆరోపించారు. ఈ విషయాలను డ్యామ్ సేఫ్టీ అధికారులే వెల్లడించారని చెప్పారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ సుజల స్రవంతి పేరుతో కాంగ్రెస్ హయాంలో తుమ్మిడిహెట్టి వద్ద చేపట్టిన ప్రాజెక్టుకు సంబంధించి రూ.800కోట్ల ఖర్చుతో కాల్వల నిర్మాణం చేపట్టారని గుర్తుచేశారు. తుమ్మిడిహెట్టిని పునఃపరిశీలన చేసి కొంతమేరకు పనులు చేసినట్లయితే.. అప్పుడు చేపట్టిన కాల్వల ద్వారా నీటిని తీసుకొచ్చే అవకాశం ఉందన్నారు. మేడిగడ్డ తప్పిదానికి బాధ్యులపై చర్యలు తీసుకుని శిక్షలు వేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్తు కొనుగోళ్లకు సంబంధించి విచారణ కమిషన్ వేయాలని అడిగిందే బీఆర్ఎస్ వాళ్లన్నారు. ఇప్పుడు కమిషన్‌కు అర్హత లేదని చెప్పి.. వాస్తవాలు తెలియకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రైల్‌రోకో కేసులో కేసీఆర్‌తో పాటు తానూ ఉన్నానని గుర్తు చేసిన కోదండరాం.. ఉద్యమకారులందరిపై కేసులు తొలగించాలని కోరాల్సింది పోయి.. ఆయనపైన ఉన్న కేసులే తొలగించాలనడం విడ్డూరమన్నారు.

స్పీకర్.. అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదు

» మెయిల్, స్పీడ్ పోస్టులో ఫిర్యాదులు పంపాం

» పోచారం, సంజయ్‌ను అనర్హులుగా ప్రకటించాలి

» ఇళ్లకు వెళ్లి కండువాలు కప్పడం సిగ్గుచేటు: జగదీశ్‌రెడ్డి



హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ తరఫున గెలిచిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సంజయ్ కుమార్ కాంగ్రెస్‌లో చేరడం చట్ట వ్యతిరేకమని, వారిని అనర్హులుగా ప్రకటించాలని ఎమ్మెల్యే జి.జగదీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేద్దామంటే ఆయన అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని ఆరోపించారు. ఆ ఇద్దరిపై అనర్హత వేటువేయాలని కోరుతూ స్పీకర్, అసెంబ్లీ కార్యదర్శికి వేర్వేరుగా ఈ మెయిల్, స్పీడ్ పోస్టు ద్వారా ఫిర్యాదులు పంపామన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వారిద్దరిపై స్పీకర్ చర్యలు తీసుకోకుంటే న్యాయపరంగా ముందుకెళ్తామన్నారు. పాంచ్‌న్యాయ్‌లో ఫిరాయింపులను ఆమోదించబోమని చెప్పిన కాంగ్రెస్.. ఇప్పుడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఎలా చేర్చుకుంటోందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో చట్టప్రకారం రెండు వంతుల మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమ పార్టీలో చేరారని గుర్తు చేశారు. తమ పార్టీలో చేరిన వారంతా కేసీఆర్ వద్దకు వచ్చి కండువాలు కప్పుకొన్నారని, కానీ.. ఇప్పుడు రేవంత్ ఇంటింటికి తిరిగి కండువాలు కప్పడం సిగ్గుచేటన్నారు.

ఫిరాయింపులపై కేటీఆర్ మొసలి కన్నీరు

» త్వరలోనే బీఆర్ఎస్ నుంచి మరిన్ని చేరికలు: విప్ ఆది శ్రీనివాస్



హైదరాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పార్టీ ఫిరాయింపులపైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. మొసలి కన్నీరు కారుస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆరోపించారు. గతంలో టీడీపీ నుంచి గెలిచిన తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను బీఆర్ఎస్‌లో చేర్చుకుని మంత్రిని చేసినప్పుడు కేసీఆర్‌ను ఎందుకు నిలదీయలేదని ప్రశ్నించారు. 2019లో 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో చేర్చుకున్నప్పుడు ప్రజాస్వామ్యం ఎటు పోయిందో కేటీఆర్ చెప్పాలన్నారు. సీఎల్పీ మీడియా హాల్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ కార్యక్రమాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు కేసీఆర్.. తన ఫామ్ హౌస్‌లో వీడ్కోలు పార్టీ ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. ఆ పార్టీ మునుగుతున్న నావ అని, రేవంత్‌రెడ్డి అనే తుఫానులో ఆ పార్టీ కొట్టుకుపోవడం ఖాయమని స్పష్టం చేశారు. అధికారంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేలను హీనాతి హీనంగా చూసిన చరిత్ర కేసీఆర్‌ది అని ధ్వజమెత్తారు. త్వరలోనే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి మరిన్ని చేరికలుంటాయని స్పష్టం చేశారు. ఆ పార్టీలో మిగిలేది నలుగురేనన్నారు. కాగా, దివ్యాంగులకు ఉన్నత విద్యలో 5శాతం రిజర్వేషన్ కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డి.. వారి ఆత్మబంధువుగా మారారని టీపీసీసీ దివ్యాంగుల సెల్ ఛైర్మన్ ముత్తినేని వీరయ్య కొనియాడారు.

మెట్టు దిగిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

కాంగ్రెస్సే ముఖ్యమని వెల్లడి.. కేసీ వేణుగోపాల్, దీపాదాస్ మున్షీతో భేటీ

» ఫలించిన అధిష్ఠానం బుజ్జగింపులు

» కాంగ్రెస్‌తోనే జాతి ఐక్యత: జీవన్ రెడ్డి

» పార్టీలో మొదటి నుంచి ఉన్నవారికి ప్రాధాన్యం: దీపాదాస్ మున్షీ



ఢిల్లీలోని తెలంగాణ భవన్ వద్ద ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

న్యూఢిల్లీ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వీడడం ఖాయమన్న వార్తలకు ఫుల్‌స్టాప్ పడింది. తనకు సమాచారం ఇవ్వకుండానే జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకున్నారని తీవ్ర మనస్తాపం చెందిన జీవన్‌రెడ్డి ఎట్టకేలకు మెట్టు దిగారు. కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్నవాళ్ల అభిప్రాయాల ఆధారంగానే చేరికలు, ఇతర విషయాలలో ముందుకెళతామని అధిష్ఠానం హామీ ఇవ్వడంతో ఆయన శాంతించారు. రంగంలోకి దిగిన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పరిస్థితిని చక్కబెట్టారు. మూడ్రోజులుగా అసంతృప్తితో రగిలిపోతూ పార్టీని వీడేందుకు సిద్ధపడిన జీవన్‌రెడ్డికి పార్టీ అధిష్ఠానం నుంచి పిలుపు వచ్చింది. కేసీ వేణుగోపాల్ ఫోన్ చేసి ఢిల్లీ రావాలని కోరడంతో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి బుధవారం సాయంత్రం జీవన్ రెడ్డి ఢిల్లీకి చేరుకున్నారు. తెలంగాణ భవన్‌లోని శబరి బ్లాక్‌లో జీవన్‌రెడ్డితో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అరగంటపాటు చర్చలు జరిపారు. అయినా జీవన్‌రెడ్డి వెనక్కి తగ్గలేదు. ఆ తర్వాత ముగ్గురూ కలిసి కేసీ వేణుగోపాల్ ఇంటికి వెళ్లి ఆయనతో భేటీ అయ్యారు. కాంగ్రెస్ కష్టకాలంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లోకి వెళ్లినా తాను పార్టీని నమ్ముకుని ఉన్నానని ఈ సందర్భంగా జీవన్ రెడ్డి చెప్పినట్లు తెలిసింది. కాంగ్రెస్‌లో ఎమ్మెల్యే సంజయ్ చేరికపై అసంతృప్తి వ్యక్తం చేశారని సమాచారం. జీవన్‌రెడ్డిని బుజ్జగించిన పెద్దలు.. పార్టీ అండగా ఉంటుందని, దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పుంజుకుంటున్న సమయంలో పార్టీని వీడవద్దని కోరినట్లు తెలిసింది. దీంతో చల్లబడిన జీవన్‌రెడ్డి సమ్మతించారు. భేటీ అనంతరం బయటికి వచ్చాక జీవన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తనకు కాంగ్రెస్సే ముఖ్యమంటూ వెల్లడించారు. కార్యకర్తలను కాపాడుకోవడం ఏ పార్టీకైనా ముఖ్యమని అన్నారు. కార్యకర్తల ఆత్మగౌరవాన్ని దృష్టిలో పెట్టుకుని, వారి ఆలోచనలకు అనుగుణంగానే నిర్ణయాలు తీసుకోవాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మెరుగైన ఫలితాలు వచ్చాయని, లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో రాహుల్‌గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, జాతి ఐక్యతను కాంగ్రెస్ కాపాడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలను కాంగ్రెస్ నెరవేరుస్తుందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో అమలుకాని పథకాలను తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఏకకాలంలో రూ.31 వేల కోట్లతో రుణమాఫీకి కాంగ్రెస్ సంకల్పించదని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

ఫిరాయింపులపై బీఆర్ఎస్ మాట్లాడటమా?: దుద్దిళ్ల

పార్టీలో సీనియర్ నేత అయిన జీవన్‌రెడ్డిని కించపరచడం తమ ఉద్దేశ్యం కాదని పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ అన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే చేరికను అగౌరవంగా, అమర్యాదగా భావించి ఉండవచ్చన్నారు. పార్టీలో చేరికలకు తలుపులు తెరిచే ఉన్నాయన్నారు. కాంగ్రెస్‌లో మొదటి నుంచి ఉన్నవారికి ప్రాధాన్యం తగ్గకుండా చూస్తామని స్పష్టం చేశారు. ఏ నిర్ణయం తీసుకున్నా కేసీ వేణుగోపాల్‌తో చర్చించే తీసుకుంటామని చెప్పారు. మీడియా అడిగిన ప్రశ్నలకు స్పందిస్తూ.. టీపీసీసీ అధ్యక్ష పదవిపై నిర్ణయం అధిష్ఠానానిదేనని ఆమె పేర్కొన్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ నేతల విమర్శలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. ఫిరాయింపులపై ప్రశ్నించేందుకు ఆ పార్టీకి కాస్త అయినా నైతికత ఉండాలని మండిపడ్డారు. అధికారంలో ఉండగా కాంగ్రెస్‌ను అంతం చేయాలని ప్రయత్నించారన్నారు. ఇపుడు బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య మార్పు ఎలా ఉందో స్పష్టంగా కనపడుతోందని ఆయన పేర్కొన్నారు.

డ్రగ్స్‌కు బానిసైతే భవిష్యత్తు అంధకారం

» యువత వ్యసనాలు వీడి ఉన్నత లక్ష్యాలు చేరాలి: జూపల్లి

» మాదక ద్రవ్యాల మత్తులోనే లైంగిక దాడులు, హత్యలు: సీతక్క

మాదాపూర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలకు బానిసైతే ఉజ్వల భవిష్యత్తు అంధకారమవుతుందని, యువత వ్యసనాలను వీడి లక్ష్యం వైపు అడుగులేసి ఉన్నత స్థాయికి చేరుకుని భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలని ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహించిన 'డ్రగ్స్ నియంత్రణ.. అక్రమ రవాణాపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మంత్రి సీతక్కతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ.. మానవ జన్మ ఎంతో ఉత్తమమైనదని.. కానీ చెడు వ్యసనాల కారణంగా అనారోగ్యం పాలైన చాలామంది అర్ధాంతరంగా తనువు చాలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచానికి ఉగ్రవాదం తర్వాత అంతటి పెనుసవాలుగా డ్రగ్స్ వినియోగం మారిందన్నారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు కూడా డ్రగ్స్ చేరడం ఆందోళన కలిగించే విషయమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో డ్రగ్స్ నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఎంతో డ్రగ్ పెడ్లర్లతో పాటు వినియోగిస్తున్న వారినీ అదుపులోకి తీసుకుని కేసులు పెట్టామని వెల్లడించారు. సీతక్క మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల మాఫియా ప్రపంచాన్ని గడగడలాడించి, కోట్లు కొల్లగొడుతోందన్నారు. మాదకద్రవ్యాల మత్తులో లైంగిక దాడులు, హత్యలు చేస్తున్నారని, పెద్దపల్లిలో చిన్నారిపై లైంగికదాడి హత్య ఘటన మనసును కలవరపెట్టిందన్నారు. డ్రగ్స్ అనర్థాలపై మెగాస్టార్ చిరంజీవి సందేశంతో కూడిన వీడియో, పాటను మంత్రులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీజీపీ రవి గుప్తా, మాజీ క్రికెటర్ మిథాలీరాజ్, సినీ నటులు సుమన్, తేజా సజ్జా, గాయకుడు రామ్ మిరియాల, అధికారులు పాల్గొన్నారు.

ఐటీఐఆర్ మంజూరు చేసే వరకు మాట్లాడుతూనే ఉంటా

» కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లను కలుస్తా

» ప్రతిపక్షంగా మా బాధ్యత మేము నిర్వహిస్తాం

» కాంగ్రెస్ ఐటీఐఆర్ మంజూరు చేసినప్పుడు.. రఘునందన్ రావు బీఆర్ఎస్‌లో ఉన్నడు

» నాకష్టంతోనే నేను ఎదిగా: తూర్పు జగ్గారెడ్డి



గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

హైదరాబాద్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం హైదరాబాద్‌కు ఐటీఐఆర్‌ను మంజూరు చేసే వరకూ దానిపై మాట్లాడుతూనే ఉంటానని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి స్పష్టం చేశారు. పార్లమెంటు సమావేశాలు అయిపోయిన తర్వాత కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ను కలిసి వినతిపత్రం ఇస్తానని, రద్దయిన ఐటీఐఆర్‌ను తిరిగి తీసుకురావాలని కోరతానని వెల్లడించారు. ప్రతిపక్షం తరఫున తమ బాధ్యత నిర్వర్తిస్తామని వెల్లడించారు. గాంధీభవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 14 ఎంపీ సీట్లు కాంగ్రెస్‌కు వచ్చుంటే.. రాహుల్‌గాంధీ ప్రధాని అయ్యేందుకు అవకాశం ఉండేదేమోనన్నారు. అప్పుడు తామంతా రాహుల్ దగ్గర కూర్చుని హైదరాబాద్‌కు తిరిగి ఐటీఐఆర్‌ను మంజూరు చేయించుకుని ఉండేవాళ్లమని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు సోనియా, మన్మోహన్‌సింగ్ ఇచ్చిన ఐటీఐఆర్‌ను మోదీ ప్రభుత్వం రద్దు చేయకుండా ఉంటే రాష్ట్రంలోని యువతకు ఈ పదేళ్లలో సుమారు 15లక్షల ఉద్యోగాలు వచ్చుండేవన్నారు. ఆ ప్రాజెక్టు అమలై ఉంటే సెజ్‌లు, ఇండస్ట్రియల్ పార్కులు, ట్రేడ్, వేర్ హౌస్ జోన్లు, ఎక్స్‌పోర్టు ఓరియెంటెడ్ యూనిట్లు హైదరాబాద్‌లో విస్తరించి ఉండేవని పేర్కొన్నారు. ప్రభుత్వానికీ పెద్ద ఎత్తున ఆదా యం సమకూరి ఉండేదన్నారు. ఇంత గొప్ప ప్రాజెక్టును ఎన్డీయే ప్రభుత్వం నిలిపేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం నుంచి ఎన్నికైన 8మంది బీజేపీ ఎంపీలు ప్రత్యేకంగా దృష్టి పెట్టి ఐటీఐఆర్‌ను తిరిగి తెచ్చేందుకు కృషి చేయాలని కోరారు.

నా కష్టంమీద నేను ఎదిగా

"ఐటీఐఆర్ గురించి నాకు అఆలు కూడా తెలియవని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు అంటున్నారు. ఎడ్యుకేషన్‌పరంగా నేను వీక్ అయుండొచ్చు. ఇంటర్ ఫెయిల్ అయ్యాను కూడా. రఘునందన్‌రావు పుస్తకాలు చదివితే.. నేను జీవితాన్ని చదివిన. పుస్తకాల్లో ఎవరో రాసింది ఉంటది. మెరిట్ స్టూడెంట్‌కు అనుభవాలు ఉండవు. జీవితాన్ని చదివిన వాడికి కష్టాలు, అనుభవాలు ఉంటయి" అని జగ్గారెడ్డి అన్నారు. తల్లిపాలు తాగి రొమ్ము గుద్దిండంటూ తనపై రఘునందన్‌రావు విమర్శలు చేస్తుండని, కానీ ఇక్కడ తల్లి పాత్రే తన దన్న సంగతి ఆయన తెలుసుకోవాలన్నారు. తన చిన్నతనంలో తమ దగ్గర ఆరెస్సెస్ శాఖలు నడుస్తుంటే.. పిల్లలమైన తాము గంట సేపు ఆడుకుని ప్రచారక్‌లు ఏదో చెబితే విని వస్తుండేవాళ్లమని చెప్పారు. రఘునందన్‌రావు బీజేపీలోకి డైరెక్టుగా వచ్చిండు కాబట్టి ఆ శాఖల గురించి ఆయనకు తెలియదన్నారు. ఐటీఐఆర్ మంజూరు చేసినప్పుడు ఆయన బీఆర్ఎస్‌లోనే ఉన్నారన్నారు. తన కష్టం మీద, తన తల్లి ప్రోత్సాహంతో తాను ఎదిగానని చెప్పారు. ప్రజా సమస్యలపై పోరాటాలు చేసి జైలుకూ వెళ్లానన్నారు. తన జోలికి వస్తే బీజేపీలో ఉండే కుళ్లు, కుతంత్రాలు చర్చకు పెడతానని హెచ్చరించారు.

ప్రాణాలు తీస్తున్న మద్యం

» 2019లో ప్రపంచ వ్యాప్తంగా 26 లక్షల మరణాలు

» ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక

హైదరాబాద్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మద్యం పానం ప్రజారోగ్యంపై తీవ్ర దుష్ప్రభావం చూపిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా లక్షల సంఖ్యలో మరణాలకు కారణమవుతోంది. 'గ్లోబల్ స్టేటస్ రిపోర్టు ఆన్ ఆల్కహాల్ అండ్ హెల్త్ అండ్ ట్రీట్మెంట్ ఆఫ్ సబ్‌స్టాన్స్ యూజ్ డిజార్డర్' పేరిట ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) ఇటీవల విడుదల చేసిన నివేదిక ఈ విషయాన్ని స్పష్టం చేసింది. మద్యం వినియోగానికి సంబంధించి 2019 నాటికి ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల నుంచి సేకరించిన గణాంకాల ఆధారంగా డబ్ల్యూహెచ్‌వో ఈ నివేదిక రూపొందించింది. దీని ప్రకారం 2019 నాటికి ప్రపంచవ్యాప్తంగా 40 కోట్ల మంది ఆల్కహాల్, మాదక ద్రవ్యాల వినియోగ రుగ్మతతో జీవిస్తున్నారు. వీరిలో 20.9కోట్ల మంది మందుబాబులు ఉన్నారు. మద్యపానం వల్ల కలిగే అనారోగ్యాల వల్ల 2019లో ప్రపంచ వ్యాప్తంగా 26 లక్షల మరణాలు సంభవించాయి. మొత్తం మృతుల్లో 20 లక్షల మంది పురుషులే ఉండడం గమనార్హం. అంతేకాక, మరణించిన వారిలో 20-39 ఏళ్ల లోపు వారే అత్యధికంగా ఉన్నారు. భారత్ విషయానికొస్తే 2019 నాటికి దేశ జనాభాలో 31 శాతం మంది మద్యపానం చేసే వారున్నారు. దేశంలోని పురుషుల్లో 40.9 శాతం మంది, మహిళల్లో 20.8 శాతం మంది మద్యపానం చేసేవారున్నారు. మద్యపానం వల్ల మరణించిన వారి సంఖ్యలోనైతే భారత్ ఏకంగా చైనాను అధిగమించింది. భారత్‌లోని ప్రతీ లక్ష మంది జనాభాలో 38 మంది మద్యం వల్ల మరణిస్తే చైనాలో ఈ సంఖ్య కేవలం 16గా ఉంది. కాగా, మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ప్రపంచవ్యాప్తంగా 2.98 లక్షల మంది మృత్యువాత పడ్డారు. కాగా, 2019 నాటికి ప్రపంచవ్యాప్తంగా తలసరి మద్యం వినియోగం 5.5 లీటర్లు(ఏడాదికి ఒక వ్యక్తి తాగే మద్యం)గా ఉంది. భారత్‌లో ఇది 4.9 లీటర్లుగా ఉండగా 2030 నాటికి అది 6.7 లీటర్లకు చేరనుందని డబ్ల్యూహెచ్‌వో అంచనా వేసింది.

మహిపాల్‌రెడ్డి చూపు.. బీజేపీ వైపు?

కమలం గూటికి చేరనున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే?

» ఈడీ తనిఖీలతో ఆందోళనలో బీఆర్ఎస్ నేత?

» ఢిల్లీకి రహస్య టూర్



పటాన్‌చెరు, జూన్ 26: బీఆర్ఎస్‌కు మరో షాక్ తగలనుందా? పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి బీజేపీలో చేరుతారా? ఇటీవల ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జరిపిన తనిఖీల నేపథ్యంలో ఈ నిర్ణయానికి వచ్చారా? అంటే.. మహిపాల్‌రెడ్డి ఆకస్మికంగా ఢిల్లీ పర్యటనకు వెళ్లడంతో ఈ అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బుధవారం జహీరాబాద్ మాజీ ఎంపీ, బీజేపీ నాయకుడు బీబీ పాటిల్‌తో మహిపాల్‌రెడ్డి సమావేశం కావడం కూడా ఆయన బీజేపీ వైపు అడుగులు వేస్తున్నారన్న అభిప్రాయాన్ని కలిగిస్తున్నాయి. అయితే గతంలో బీఆర్ఎస్ తరఫున రెండుసార్లు జహీరాబాద్ ఎంపీగా పనిచేసిన బీబీ పాటిల్‌తో మహిపాల్‌రెడ్డికి సన్నిహిత సబంధాలున్నందున.. ఆ చనువుతో ఆయనను కలిశారనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. కానీ, గత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు పటాన్‌చెరు నియోజకవర్గంలో లక్ష పైచిలుకు ఓట్లు సాధించడంతో.. ఓటుబ్యాంకు బీజేపీ వైపు మళ్లిందన్న సంకేతాలు కనిపించాయి. బీఆర్ఎస్ ఏకంగా మూడో స్థానానికి పడిపోవడంతో తమ రాజకీయ భవిష్యత్తు ఏమిటన్న ప్రశ్న స్థానిక బీఆర్ఎస్ నేతల మెదళ్లను తొలుస్తోంది. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం ఇదే ఫలితాలు వస్తే కేడర్ మిగలదన్న భావన వ్యక్తమవుతోంది. అయితే ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తొలుత కాంగ్రెస్‌లో చేరతారని ప్రచారం జరిగినా.. ఈడీ సోదాల తరువాత పరిణామాలు వేగంగా మారిపోయాయి. పటాన్‌చెరు నియోజకవర్గంలో తన ప్రధాన అనుచరులుగా చెప్పుకొనే వారికి సైతం చెప్పకుండా ఆయన ఢిల్లీకి వెళ్లారు. కేవలం కేసు పనిమీద న్యాయవాదులను కలిసేందుకు వెళ్లినట్లు ఆయన అనుచరులు చెబుతున్నా.. బీజేపీ నేత బీబీ పాటిల్‌తో మంతనాలకు సంబంధించి మాత్రం సమాధానం కరువైంది. అంతేకాకుండా బీజేపీ సంగారెడ్డి జిల్లా ముఖ్యనాయకుడు సైతం ఎమ్మెల్యే వెంట వెళ్లడం అనుమానాలు మరింత బలపడేలా చేస్తోంది.

కాంగ్రెస్ చేరేందుకు స్థానికంగా వ్యతిరేకత

మహిపాల్‌రెడ్డి తొలుత కాంగ్రెస్‌లో చేరేందుకే ప్రయత్నాలు చేశారని, కానీ.. ఆయన ప్రయత్నాలను స్థానిక కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా వ్యతిరేకించడంతో వెనక్కి తగ్గారని సమాచారం. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్, మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి రెండో స్థానంలో నిలిచిన నీలం మధు ముదిరాజ్.. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి చేరికను వ్యతిరేకించినట్లు తెలిసింది. మరోవైపు మహిపాల్‌రెడ్డి, ఆయన సోదరుడు మధుసూదన్‌రెడ్డి ఇళ్లు, కార్యాలయాల్లో ఈడీ అధికారులు ఇటీవల తనిఖీ చేసి పెద్ద ఎత్తున స్థిరాస్థులకు సంబంధించిన డాక్యుమెంట్లు, నగదును స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. దీంతోపాటు బినామీలుగా భావిస్తున్న కొందరిని ఈడీ కార్యాలయానికి పిలిపించి అక్రమాస్తులపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. కిష్టారెడ్డిపేట గ్రామానికి చెందిన ఓ బిల్డర్ మధుసూదన్‌రెడ్డికి బినామీగా వ్యవహరిస్తున్నట్లు ఆధారాలు లభ్యం కావడంతో ఆయన నుంచి వివరణ అడిగారు. మిగతా బినామీ వ్యక్తులు ఈడీ నుంచి తప్పించుకునేందుకు నానా పాట్లు పడుతున్నారని తెలిసింది. ఎవరికి ఎప్పుడు ఈడీ నుంచి పిలుపు వస్తుందో, ఎవరి ఇళ్లలో సోదాలు చేస్తారోనన్న భయంతో వారు బిక్కుబిక్కుమంటున్నారు.

6 నెలల్లో అన్నీ తారుమారవుతాయి

(మొదటి పేజీ తరువాయి)

చూస్తున్నారన్న మాటలు కార్యకర్తల నుంచి వినిపిస్తున్నాయి. ఈ తరుణంలో ఆయన కేసీఆర్‌ను కలవడంతో ఆ ఊహాగానాలకు తెరపడినట్టేనని కొందరు భావిస్తుండగా, మరికొందరు నాయకులు మాత్రం పార్టీ మారే అవకాశాలను కొట్టిపారేయలేమని వాదిస్తున్నారు. ఐదుగురు ఎమ్మెల్యేలు కేసీఆర్‌ను కలిసి చర్చలు జరిపినప్పుడు మాజీ మంత్రి హరీశ్‌రావు కూడా ఉన్నట్లు సమాచారం. లక్ష్మారెడ్డి వెంట నియోజకవర్గ నాయకులు తరలివెళ్లారు. నాయకులందరూ కేసీఆర్‌తో ఫొటోలు దిగిన అనంతరం అక్కడే భోజనాలు చేశారు. ఆయనను కలిసిన వారిలో మాజీ మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్సీ తాతామధు, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు. వారితో కేసీఆర్ సుదీర్ఘంగా చర్చించారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు దాదాపు ఐదు గంటల పాటు కేసీఆర్ ఫాంహౌస్‌కు వచ్చిన కార్యకర్తలను కలిశారు.

ఎమ్మెల్యే సత్యంను పరామర్శించిన ఎమ్మెల్సీ రమణ



ఎమ్మెల్యే సత్యంతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎల్ రమణ

జగిత్యాల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను బుధవారం జగిత్యాలకు చెందిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్ రమణ పరామర్శించారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భార్య రూపాదేవీ ఆత్మహత్యకు పాల్పడడంతో శోకసంద్రంలో మునిగిన ఆయనను హైద్రాబాద్‌లోని నివాసంలో ఎమ్మెల్సీ ఎల్ రమణతో పాటు పలువురు నాయకులు ఓదార్చారు. రూపాదేవీ మృతి పట్ల సంతాపం తెలిపారు.

మున్నూరుకాపు సంఘం పెగడపల్లి మండల అధ్యక్షుడిగా రవీందర్



పెగడపల్లి, జూన్ 26: మున్నూరుకాపు సంఘం పెగడపల్లి మండల అధ్యక్షుడిగా రాజారాంపల్లి గ్రామానికి చెందిన సాయిని రవీందర్‌ను నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర కన్వీనర్ చింతపండు మహేందర్ పటేల్ ఉత్తర్వులు జారీ చేశారు. మున్నూరుకాపు రైతుల కోసం, విద్యార్థుల హాస్టల్స్ కోసం, బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం పోరాడాల్సిందిగా పేర్కొంటూ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతూ సంఘం బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టులు భర్తీ చేయాలి

కథలాపూర్, జూన్ 26 : మండలంలో కొన్నేళ్లుగా ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టులను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని మండల అంగన్‌వాడీ టీచర్స్, మరియు హెల్పర్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆయా పోస్టులు లేని చోట టీచర్లే ప్రైవేట్ వ్యక్తులకు వేతనం ఇస్తూ తాత్కాలికంగా ఆయాలను కొనసాగించాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. అదే విధంగా ప్రభుత్వం అమలు పరిచే అన్ని రకాల పథకాల కోసం అంగన్‌వాడీ టీచర్లను వినియోగించుకుంటున్నారన్నారు. పిల్లల సంరక్షణతో పాటు ఆటా, పాటలతో కూడిన విద్య అందిస్తున్నామని పేర్కొన్నారు. అదనపు పనులు చెప్పడం వల్ల మానసికంగా, ఆర్థికంగా ఎన్నో ఇబ్బందలకు గురవుతున్నామన్నారు. కేంద్రాల్లో టీచర్లు అందుబాటులో లేకపోవడం వల్ల పిల్లల సంఖ్య తగ్గిపోతోందన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు సునీత, ఉపాధ్యక్షురాలు ఎం వనిత, కార్యదర్శి ప్రతిభ, సుజాత, లక్ష్మీ, స్వర్ణప్రభ తదితరులు ఉన్నారు.

కథలాపూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా సంజీవ్‌రెడ్డి



ఎన్నికైన కార్యవర్గం

కథలాపూర్, జూన్ 26 : మండల లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా పిడుగు సంజీవ్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం మండల కేంద్రంలో ఎన్నిక నిర్వహించారు. సెక్రటరీగా ఎల్లాల ప్రతాప్‌రెడ్డి, కోశాధికారిగా గడ్డం శ్రీనివాస్ రెడ్డిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా పాస్ట్ గవర్నర్ చిదురాల సురేశ్, డాక్టర్ దిలీప్‌రావు, ఏలిమి రాంనారాయణ, గుంటుక ప్రకాశ్, పోతని ప్రవీణ్, ఆడెపు మధు, ఆడెపు కమల తదితరులు ఉన్నారు.

పాఠశాలలో పనులు తనిఖీ చేసిన ఎంపీడీఓ

కథలాపూర్, జూన్ 26: మండలంలోని కలికోట ప్రాథమికోన్నత పాఠశాలలో కొనసాగుతున్న అమ్మ ఆదర్శ పనులను బుధవారం ఎంపీడీఓ శంకర్ తనిఖీ చేశారు. వంట గది నిర్మాణం, విద్యుద్దీకరణ, ఫ్యాన్లు, ట్యూబుల ఏర్పాటు వంటి పనుల ప్రగతిని స్థానిక హెచ్ఎంను అడిగి తెలుసుకున్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలని సూచించారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులకు వంటగది లేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఆ పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, సీనియర్ మేట్ అంబటి రాధాకృష్ణ ఉన్నారు.

ఆరెపల్లి బస్సు ఏడో ట్రిప్పు నడిపించాలి

ధర్మపురి, జూన్ 26: ధర్మపురి-ఆరెపల్లి మధ్య నడిచే ఆర్టీసీ బస్సు ఏడో ట్రిప్పు కొనసాగించాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు. జగిత్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు గతంలో ఆరెపల్లి వరకు ఏడు ట్రిప్పులు నడస్తుండగా ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా ఉండేదని పేర్కొన్నారు. ఇటీవల ఏడో ట్రిప్పు రద్దు చేసి కేవలం ఆరు ట్రిప్పులు నడిపించడం వల్ల దమ్మన్నపేట, రాజారం, జైనా, మగ్గిడి ఎడపల్లి, దొంతాపూర్, ఆరెపల్లి వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సాయంత్రం ఐదు గంటల తరువాత ఆయా గ్రామాలకు వెళ్లే ప్రయాణికులకు బస్సు సౌకర్యం లేక పోవడం వల్ల ప్రయాణికులు కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. జగిత్యాల బస్ డిపో మేనేజర్ కూడ ప్రత్యేక దృష్టి సారించి ఏడో ట్రిప్పుకూడా నడిపించాలని జైనా మాజీ ఎంపీటీసీ కె గంగారెడ్డి కోరుతున్నారు.

మృతుడి కుటుంబానికి సరుకుల అందజేత

కొడిమ్యాల, జూన్ 26: మండలంలోని సూరంపేట గ్రామానికి చెందిన పిట్టల మల్లేశం అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. మృతుడి భార్య సౌందర్యకు బుధవారం ఉదయం ఫౌండేషన్ జగిత్యాల వారి ఆద్వర్యంలో 25 కిలోల బియ్యం, నెల రోజులకు సరిపడా 15రకాల నిత్యావసర సరుకులను అందించారు. ఒక వెయ్యి రూపాయల నగదును అందించారు. ఈ కార్యక్రమంలో ఉదయం ఫౌండేషన్ సభ్యులు గొర్రె తిరుపతి, మహిపాల్, జలెందర్, సంతోష్, సతీష్‌రెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా తాతమ్మతల్లి బోనాల పండుగ



మల్లాపూర్ బోనాలతో భక్తులు

మల్లాపూర్, జూన్, 26 : మల్లాపూర్ మండల కేంద్రంలో తాతమ్మ తల్లి బోనాల పండుగను శాలివాహన(కుమ్మరి) కులస్థులు ఘనంగా నిర్వహించారు. బుధవారం మండల కేంద్రంలోని అమ్మ వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం బోనాలతో గ్రామంలోని పుర వీధులగుండా డప్పుచప్పుల మధ్య ఆలయానికి చేరుకున్నారు. ఆలయం చుట్టు ప్రదిక్షణాలు చేసి అమ్మ వారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఇసుక డంపుల వేలం

ధర్మపురి, జూన్ 26:మండలంలోని రాయపట్నం ఇసుక డంపు వేలం ద్వారా రూ 5,40,600 ఆదాయం లభించినట్లు మండల తహసీల్దార్ కృష్ణచైతన్య తెలిపారు. రాయపట్నం గోదావరి బ్రిడ్జి సమీపంలో గల ఆలయం వద్ద ఇటీవల పోలీస్, రెవెన్యూ, మైనింగ్ శాఖ సంయుక్తంగా దాడులు నిర్వహించి 300 ట్రిప్పుల ఇసుకను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కలెక్టర్ సత్యప్రసాద్ ఈ ఇసుక డంపును పరిశీలించి, రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు వివరించారు. ఇందుకోసం వేలం నిర్వహించగా ఒక కాంట్రాక్టర్ ముందుకు వచ్చి అత్యధికంగా రేటు పలికి ఇసుక డంపును దక్కించుకున్నట్లు తెలిపారు. ఈ వేలంలో ఆర్ఐలు వెంకటేష్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే మాదక ద్రవ్యాల నిర్మూలన



ప్రతిజ్ఞ చేపిస్తున్న ఎస్పీ, అడిషనల్ కలెక్టర్



ధర్మపురిలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ



జగదేవ్‌పేటలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

● ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల టౌన్, జూన్ 26: ప్రజల భాగస్వామ్యంతోనే మాదక ద్రవ్యాలను నిర్మూలించవచ్చునని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. ప్రపంచ మాదకద్రవ్యాల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని జిల్లా ఎస్పీ జెండా ఊపి ప్రారంభించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కొత్త బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు అవగాహన ర్యాలీని చేపట్టారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ డ్రగ్స్‌కు యువత బానిసై తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రాంబాబు, డీఎస్పీ రఘు చందర్, టౌన్ సీఐ వేణు గోపాల్, రూరల్ సీఐ కృష్ణా రెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మి నారాయణ తదితరులు ఉన్నారు. అలాగే కలెక్టరేట్ సముదాయంలో మహిళా శిశు సంక్షేమ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సును నిర్వహించారు. అడిషనల్ కలెక్టర్ రాంబాబు హాజరై మాట్లాడుతూ జగిత్యాల జిల్లాను మాదక ద్రవ్య రహిత జిల్లాగా మార్చాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి వాణిశ్రీ తదితరులు ఉన్నారు.

జేఎన్‌టీయూలో...

కొడిమ్యాల: డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితం నాశనం అవుతుందని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయు ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. యువత డ్రగ్స్‌కు బానిసై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. మాదక ద్రవ్యాలు అమ్మడం, సేవించడం నేరం అన్నారు. కార్యక్ర మంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. ప్రభాకర్, డీఎస్పీ రఘుచందర్, మల్యాల సీఐ నీలం రవి, కొడిమ్యాల ఎస్సై ఎస్. సందీప్, పోలీస్, కళాశాల బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మపురిలో..

ధర్మపురి : ధర్మపురి పట్టణంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిరోధక దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, మండల తహసీల్దార్ కృష్ణచైతన్య జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ ర్యాలీ స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి గాంధీ చౌక్ మీదుగా నంది చౌక్ వరకు కొనసాగింది. ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, యువకులు, ఆటో డ్రైవర్లు మాదక ద్రవ్యాలను నిర్మూలిద్దాం అంటూ నినాదాలు చేశారు. అనంతరం గాంధీ చౌక్ వద్ద విద్యార్థులు, యువకులు, ఆటో డ్రైవర్లకు మాదక ద్రవ్యాల గురించి అవగాహన కల్పించారు. వారందరిచే పోలీసులు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సీఐ రాంనర్సింహారెడ్డి మాట్లాడుతూ యువత చెడు అలవాటులకు దూరంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ధర్మపురి మండల తహసీల్దార్ కృష్ణచైతన్య, సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐ ఉదయ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువకులు, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

వెల్గటూర్‌లో..

వెల్గటూర్, జూన్ 26: యువత మత్తు పదార్థాలు (డ్రగ్స్)కు అలవాటు పడి, గంజాయి సేవిస్తూ జీవితాలు నాశనం చేసుకోవద్దని ఎస్సై ఉమా సాగర్ కోరారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జగదేవ్‌పేట ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో విద్యార్థులచే ర్యాలీ నిర్వహించి డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సురేంద్ర స్వామి, నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, లింగయ్య, ఉపాధ్యాయులు రాధా కిషన్, ముజా హిద్ అలీ, నీలం సంపత్, మహేష్, సీఆర్పీ వెంకటేష్ పాల్గొన్నారు.

కోరుట్లలో..

కోరుట్ల: చెడు అలవాట్లకు దూరంగా ఉండి చదువుపై శ్రద్ద చూపాలని ఎస్ఐ కిరణ్ కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలో మిసన్ పరివర్తన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు డ్రగ్స్ నియంతరణపై అవగాహన కల్పించారు. గంజాయి, మద్యపానం డ్రగ్స్ లాంటి వాటికి అలువాటు పడకుండా చదువులో రాణించి ఉన్నత స్థానాలు సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళశాల ప్రిన్సిపల్ సకినాల రాజు, డైరెక్టర్ హరిప్రియ అంజయ్య గౌడ్ పాల్గొన్నారు.

మెట్‌పల్లిలో..

మెట్‌పల్లి: మాదకద్రవ్యాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని ఎస్సై చిరంజీవి సూచించారు. బుధవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలోని విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని అధ్యాపక బృందం, పోలీసులు చేపట్టారు. కళాశాలలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించినంతరం విద్యార్థులచే మాదద్రవ్యాలను వాడమని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బూర్ల చంద్రశేఖర్, జూనియర్ కలాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, వెంకయ్య, గట్టయ్య, మధుబాబు, లావణ్య, చిలకనూరి శ్రీనివాస్, ఏఎస్సై ఆంజనేయులు పాల్గొన్నారు.

రాయికల్‌లో..

రాయకల్ : గంజాయి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జగిత్యాల రూరల్ సీఐ కృష్ణారెడ్డి అన్నారు. రాయికల్ పట్టణంలోని ప్రణుతి జూనియర్ కళాశాలలో బుధవారం ప్రపంచ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు మాదక ద్రవ్యాలైన గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రూరల్ సీఐ కృష్ణారెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్‌కు యువత బానిస కావొద్దని, బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని అన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై దేవేందర్, ప్రతిమ ఫౌండేషన్ ఆరనైజర్ రఘుపతిరెడ్డి, ప్రిన్సిపాల్ శివ ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

గొల్లపల్లిలో..

గొల్లపల్లి: ప్రజలు మాదక ద్రవ్యాల నివారణకు కృషి చేయాలని గొల్లపల్లి ఎస్సై సతీష్ అన్నారు. గొల్లపల్లి మండల కేంద్రంలో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా గంజాయి సేవించినా, విక్రయించినా తమకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చినవారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, మండల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మెట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..



కోరుట్లలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్సై కిరణ్ కుమార్

పాఠశాలల బంద్ విజయవంతం

● ఫీజుల నియంత్రణ చట్టం తేవాలని ఏబీవీపీ డిమాండ్

జగిత్యాల అర్బన్, జూన్ 26: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో వసూలు చేస్తున్న ఫీజులను నియంత్రించాలని, విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలనే డిమాండ్‌తో తలపెట్టిన పాఠశాలల బంద్ విజయవంతం అయినట్లు ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాకేష్ అన్నారు. ఏబీవీపీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు బుధవారం పాఠశాలల బంద్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి పాఠశాలకు తిరుగుతూ విద్యార్థులను బయటకు పంపించి వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలను వ్యాపార కేంద్రాలుగా మార్చుతున్నా, ఇష్టారీతిన ఫీజులు వసూలు చేస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరించడం సరికాదన్నారు. గతంలో పలుమార్లు పుస్తకాలు అమ్ముతున్నారని సాక్ష్యాధారాలతో అధికారులకు పట్టించిన చర్యలు శూన్యమన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవడంతో పాటు పాఠశాల గుర్తింపును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మెగా డీఎస్సీ ద్వారా అధ్యాపక అధ్యపకేతర సిబ్బందిని సత్వరమే భర్తీ చేయాలని, ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు 25శాతం కోటా పేద, మధ్య తరగతి విద్యార్థులకు సీట్లు కేటాయించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసుతల కల్పనతో పాటు, పాఠశాలల బలోపేతం కోసం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఏబీవీపీ ఆధ్వర్యంలో ఉద్యమాలకు సిద్దం అవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు రాపాక సాయి, రాజు, ప్రశాంత్, కళ్యాణ్, విఘ్నేష్, విష్ణు, రాకేష్, విశాల్, బన్నీ, అరవింద్ తదితరులున్నారు.

కొడిమ్యాల: ఏబీవీపీ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు కొడిమ్యాలలో బుధవారం పాఠశాలలను మండల ఏబీవీపీ నాయకులు బంద్ చేయించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని,



జగిత్యాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

ప్రైవేటు పాఠశాలలో అధిక ఫీజుల వసూళ్ల నివారణ కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ తాము పాఠశాలలను బందు చేయిస్తున్నట్లు ఏబీవీపీ నాయకుడు బోగ రాకేష్ తెలిపారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు కాయిత అంజయ్య, బైరి కార్తిక్, అయిట్ల రమేష్, శ్రీధర్ , రమేష్, అనిల్ పాల్గొన్నారు.

మల్యాల: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, ప్రైవేట్ స్కూళ్లల్లో అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యసంస్థల బంద్ మండలంలో విజయవంతమైంది. ప్రైవేట్ పాఠశాలల్లో ముందు రోజే బంద్‌గా ప్రకటించారు.

రాయికల్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన పాఠశాలల బంద్ రాయికల్ పట్టణంలో బుధవారం విజయవంతమైంది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించాలని, ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల నియంత్రణకు చర్యలు చేపట్టాలని కోరారు.

మండల పరిషత్ సమావేశం వాయిదా

మల్యాల, జూన్ 26: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. ఎంపీపీ ఆగంతం రవళి అధ్యక్షతన సమావేశం నిర్వహించగా సభ్యులు సమావేశంకు రాలేదు. దీంతో కోరం సరిపడ లేనందున వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో స్వాతి ప్రకటించారు. సమావేశానికి వైద్య, ఐకేపీ, విద్య, విద్యుత్ శాఖ అధికారులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాత్రమే హాజరు అయ్యారు. అధికారులు పూర్తి స్థాయిలో హాజరుకాకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశం కోసం ఎంపిక పోటీలు

పెగడపల్లి, జూన్ 26 : క్రీడా పాఠశాలలో విద్యార్థులను చేర్చుకునేందుకు బుధవారం పెగడపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపిక పోటీలు నిర్వహించారు. మండలంలోని వివిద పాఠశాలలకు చెందిన 13 మంది విద్యార్థులు పాల్గొనగా ముగ్గురిని జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు ఫిజికల్ డైరక్టర్ రమేష్ తెలిపారు. ఎంపిక పోటీలలో ఫిజికల్ డైరక్టర్ రమేష్, మోడల్ స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయులు కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

రాయికల్: రాయికల్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం స్పోర్ట్స్ స్కూల్‌లో 4వ తరగతి ప్రవేశానికై ఎంపిక పోటీలు నిర్వహించినట్లు ఎంఈవో గంగాధర్ తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన బాల, బాలికలు ఈ నెల 28న జగిత్యాలలోని వివేకానంద మినీ స్టేడియంలో పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు రాఘవులు, శ్రీనివాస్, పీడీలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట బీడీ కార్మికుల ధర్నా

కోరుట్ల, జూన్ 26: బీడీ కార్మిక సంఘానికి చెందిన ఖాళీ స్థలంలో మున్సిపల్ సిబ్బందితో బేస్‌మెంట్‌ను కూల్చి వేయడానికి ప్రయత్నించిన వార్డు కౌన్సిలర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం మున్సిపల్ కార్యాలయ వద్ద బీడీ కార్మిక సంఘ, సీపీఐ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ తిరుపతికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీడీ కార్మిక భవన నిర్మాణం కొరకు ఏర్పాటు చేసుకున్న బేస్‌మెంట్‌ను మున్సిపల్ అధికారులకు తప్పుడు సమాచారం అందించి కూల్చి వేయడం సరికాదని సీపీఐ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు సుతారి రాములు, చెన్న విశ్వనాథం, హనుమంతు, గాద దేవదాసు, వెన్న మహేష్ పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే కఠిన చర్యలు

వెల్గటూర్, జూన్ 26: రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి వాణి హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రం లోని శ్రీలక్ష్మి, శ్రీనివాస, కృష్ణసాయి, వెల్గటూర్ సొసైటీలలో తనిఖీ నిర్వహించారు. స్టాక్ రిజిష్టర్, బిల్లులు, ఈ పాస్ మిషన్, రైతు వారి కొనుగోలు రిజిష్టర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు కొనుగోలు చేసిన ప్రతీ దానికి బిల్లులు ఖచ్చితంగా ఇవ్వాలని సూచించారు. స్టాక్ రిజిష్టర్‌లో తేడాలు ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆమె వెంట ఏఈవో వినోద్ ఉన్నారు.

దళితజనోద్ధారకుడు చత్రపతిసాహూ మహరాజ్

జగిత్యాలరూరల్ జూన్ 26: దళిత, బలహీనవర్గాల అభ్యున్నతికి సామా జిక గౌరవానికి ఎనలేని కృషిచేసిన వ్యక్తి చత్రపతి సాహూ మహారాజ్ అని సామాజిక సమరసతా వేదిక రాష్ట్రకార్యవర్గ సభ్యుడు ఆకుతోట వెంకటరమ ణారెడ్డి అన్నారు. చత్రపతి సాహూ 150వ జయంతి కార్యక్రమాన్ని జగిత్యాల మండలం ధర్మారం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సాహు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వెంకరమ ణారెడ్డి మాట్లాడుతూ సంఘ సంస్కర్త, రిజర్వేషన్ల పితామహుడు, బడుగు బలహీనవర్గాల పెన్నిధి అయిన సాహు మహారాజ్ జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.

కోరుట్ల నర్సింగ్‌హోంలో ఉచిత వైద్య శిబిరం



దంపతులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న వైద్యులు

కోరుట్ల, జూన్ 26: పట్టణంలోని కోరుట్ల నర్సింగ్ హోంలో వైద్యరాలు స్వాతి అనూప్‌రావు ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని రజనీ ఫెర్టిలిటీ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం ఆసుపత్రి వైద్యురాలు బంగారి రజనీ ప్రియదర్శిని పిల్లలు కాని దంపతులకు ఉచిత వైద్య పరీక్షలను నిర్వహించి, అవగాహన కల్పించారు. సుమారు 300 మంది దంపతులకు వైద్యురాలు రజనీ ప్రియదర్శిని, స్వాతి అనూప్‌లు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ సంతాన లేమి సమస్య అనేది యువతలో ఎక్కువగా ఉందని ఆరోగ్యకరమైన జీవన విధానం, సరైన సమయంలో వివాహం అనేది ముఖ్యమని అన్నారు. డా. మనోహర్‌రావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

తెరుచుకోని పాఠశాల

మెట్‌పల్లి, జూన్, 26: మెట్‌పల్లిల్లోని ఏకలవ్యనగర్ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల బుధవారం తెరుచుకోలేదు. ఏబీవీపీ పాఠశాలల బంద్ ప్రకటించగా పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలు పూర్తిగా బంద్ పాటించాయి. పట్టణంలోని కొన్ని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు బంద్ పాటించి విద్యార్థులను ఇంటికి పంపించారు. ఏకలవ్యనగర్ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఒక రోజు ముందుగానే విద్యార్థులకు సెలవు ఇచ్చినట్లు స్థానికులు తెలిపారు. దీంతో పాఠశాలకు విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరుకాలేదు. ఈ విషయంపై ప్రధానోపాధ్యాయుడిని సంప్రదించడానికి ఫోన్ ద్వారా ప్రయత్నించగా స్పందించలేదు. ఎంఈవోను వివరణ కోరగా సెలవు ప్రకటించలేదని బంద్ సందర్భంగా విద్యార్థి సంఘాలు కోరితే విద్యార్థులను ఇంటికి పంపించి ఉపాధ్యాయులు పాఠశాలలోనే ఉండాలని తెలిపారు.



తాళం వేసి ఉన్న ఏకలవ్యనగర్ ప్రభుత్వ పాఠశాల